**ఒకప్పుడు లక్ష్యం కోసం ఆస్తినంతా ధారపోసినవాళ్ళే యిప్పుడు కేవలం తిండి కోసం అక్రమ పద్ధతికి దిగవలసి రావడం అంటే యెంత దారుణం!**

**"అవునయ్యా బాబు! ఈ సర్టిఫికెట్ కోసం నెల్లాళ్ళుగా నీవు ఈ ఆఫీసుచుట్టూ తిరుగుతున్నావు! నేను కాదన్నానా? మరి మాకా పాత రికార్డు దొరకాలిగా! నీవ్వే చెప్పు, పోనీ ఇదేవన్నా అయిదేళ్ళనాటి పాత రికార్డా? పదేళ్ళనాటి రికార్డా? పాతికేళ్ళనాటి రికార్డా? పోనీ ముప్ఫయి ఏళ్ళదా? నీవ్వే చెప్పు—**

# దొంగల రాజ్యం

## అరిగే రామారావు

ఇది నైన్‌టీన్ ఫార్టీసిక్స్‌నాటి రికార్డా కాదా! అంటే ముప్ఫయిఆరు సంవత్సరాల క్రితంనాటి పాతరికార్డు! నైన్టీన్ ఫార్టీసిక్స్ నాటికి నేను పుట్టే లేదు; అసలు అప్పటికి మా నాన్నకు పెళ్ళే కాలేదు! అయినా తీస్తాం! నైన్టీన్ ఫార్టీసిక్స్ నాటికి నేను పుట్టకపోయినా, మా నాన్నకు పెళ్ళి కాకపోయినా ఆనాటి పాత రికార్డు తీస్తాం! తీయటానికేగా మేం ఇక్కడవుంది! మరి నాకా రికార్డే దొరకడంలేదే! వారంరోజులుగా నా అసిస్టెంట్ సెలవులో వున్నాడే? ... అయినా చూస్తాం మీరు మళ్ళీ రేపు రాండి!"

ఇంత భారీ డైలాగ్ చెప్పిన భారీ కాయం ఆయాసపడుతూ టేబిల్ మీద గ్లాసందుకొని మంచినీళ్ళు త్రాగసాగింది.

రఘురామయ్యగారు నీరసంగా లేచి నిలబడ్డాడు. "ఏదో కాస్త చూడండి బాబు!" అన్నాడు దీనంగా.

భారీకాయం మంచినీళ్ళు ఒక ప్రక్క త్రాగుతూనే తల అటూ, ఇటూ వూగించింది.

రఘురామయ్య మెల్లగా నడుచుకుంటూ రోడ్డుమీదకొచ్చాడు.

బయట ఎండ చిటచిట లాడిపోతూంది. వుదయం పదకొండు గంటలకే రోహిణీ కార్తి ఆర్తి మొదలైంది.

బస్సుస్టాపులో నిలబడ్డ రఘురామయ్య ఆ ఎండ ధాటికి తట్టుకోలేక వుస్సురుస్సురంటున్నాడు. వేసుకున్న ఖద్దరు కళ్ళీ లాల్చీ చెమటకు తడిసి ముద్దయిపోయింది. వడగాల్పు ఈచెవులోంచి, ఆచెవులోకి దూసుకుపోతూంది. భుజంమీది కండువాతీసి నెత్తి మీదగా జారవేసుకున్నాడు.

తనెక్కవల్సిన సిటీబస్సేకాదు ఏ సిటీ బస్సు జాడాలేదు.

ప్రక్క సందులోంచి ఒక సోడా బండి వాడు త్రోసుకుంటూవచ్చి బస్సుస్టాపుదగ్గర ఆగాడు.

ఆ స్టాపులో రఘురామయ్యతో పాటు మరో నల్గురు ఆసాములు నిలబడివున్నారు.

సోడాబండివాడు రఘురామయ్య వేసుకున్న చినుగుల ఖద్దరు లాల్చీనీ, ఆయన నెత్తిమీది కండువానూ, చేతిలోని మురికి సంచీనీ, ముక్కుకొనమీదకు జారిపోతూన్న చత్వారపు కళ్ళజోడునూ, అరిగిపోయి వుంగటాలు వూడిపోయిన పాతడొక్కు చెప్పులనూ చూసి ఇది సోడాత్రాగే రకం కాదనుకున్నాడేమో! వెలేసినట్లు ఆయన్ని మాత్రం వదిలేసి మిగతా ఆ నల్గురు దగ్గరికెళ్ళి, "సోడా—సోడా, చల్లటి నిమ్మకాయ సోడా!" అని అరిచాడు.

ఆ నల్గురూ సోడాలు కొట్టించుకొని త్రాగారు.

ఆయనకు గొంతు తడి ఆరిపోతోంది. నాలిక పిడచకట్టుకుపోతోంది. సోడా త్రాగాలని ప్రాణం పీకుతూంది. జేబులో డబ్బులు తీసి లెఖ్ఖ చూశాడు. సిటీబస్సుకు బొటాబొటీగాసరిపోతాయి. దీర్ఘంగా నిట్టూర్చాడు. ఎండిపోయిన గొంతులోకి వుమ్మిగుటక తెచ్చుకొని నాలికతో పెదాలు తడుపుకొని సంతృప్తి పడ్డాడు.

బస్సొచ్చింది. ఆ చెమట్లో ఆ కంపులో వ్రేలాడి, ఆ కుదుపులకూ కుమ్ములాట్లకూ వుక్కిరిబిక్కిరయి, ఎట్టకేలకు కొంపకు జేరేసరికి గంట రెండుకొట్టింది! పాపం, ఆయన ముసలి ప్రాణం కడబట్టింది.

గుమ్మంలోనే కోడలు మహాతల్లి కామాక్షి సాక్షాత్కరించింది. ఎక్కడలేని ఆప్యాయతా వొలకబోస్తూ, "మామయ్యగా రొచ్చారు—మామయ్యగారొచ్చారు!" అంటూ మంచినీళ్ళగ్లాసుతో ఎదురొచ్చింది.

ఆయన గొంతులో మంచినీళ్ళగొంతులో వుండగానే ఇరవైనాల్గు ప్రశ్నలూ, అరవైఆరు ఆరాలూ!

"ఏంవయిందండీ మాంవగారూ! ఆ జైలువాళ్ళు ఇవ్వాళ్ళయినా మీ జైలు సర్టిఫికెట్ యిచ్చారా? ఏదీ, నన్ను చూడనీండి!" అంది ఆదుర్దాగా.

రఘురామయ్య తల అడ్డంగా వూగిస్తూ, "ఇవ్వలేదు తల్లీ! ఆ పాత రికార్డు కనిపించలేదంట. మళ్ళీ రేపు రమ్మన్నారు" అన్నాడు




నీరసంగా.

మూతి ముప్పైఆరు వంకర్లు త్రిప్పుతూ మామగారి చేతిలోని ఖాళీ గ్లాసును ధబాల్న లాక్కొని, "అయితే మళ్ళి రేపు వెళ్ళాలన్న మాట! రేపు మళ్ళి ఇంకో రెండు రూపాయలు ఖర్చు!" అంటూ చరచరా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

గ్లాసును కోపంగా క్రిందపడేసిన శబ్దం దాన్తోపాటు మామూలు సాధింపులూ వంటింట్లోంచి వినిపించసాగాయి.


"ముఖారవిందాలు! మన మొగాలు చూస్తే అయ్యేపన్లుకూడా కావు—చేసేవాళ్ళు కూడా చెయ్యరు! వెధవ సర్టిఫికెట్ కోసం నెల్లాళ్నుంచీ తిరుగుతున్నాడు. ఇక ఈయన గారు ఆ సర్టిఫికెట్ తెచ్చి, ఆ కాగితాలుపంపి ఆ పెన్షన్ శాంక్షనయి, ఆ డబ్బులొచ్చి మేం తినీ—" ఇది ఈ జన్మలో చూడం! ఒరేయ్ మాయదారి పిల్లల్లారా! మళ్లీ తిండికి తగలడ్డారా? దరిద్రులకు ఆకలెక్కువని చేసే పనులు లేకపోయినా తిండికేం తక్కువలేదు...."

వీపులమీద గుద్దుల మోతలూ, వెంటనే గీబా—గీబా ఏడుపుల్నూ—ఆ తర్వాత లోపల్నించి ఏడుస్తూ బయటికి వచ్చిన మనుమణ్ని, వాడి వెనకాతలే వాడి తోకలాగా వచ్చిన మనుమరాల్నీ చూసి రఘురామయ్య నిస్సహాయంగా నిట్టూర్చాడు.

ఆయన విప్పిన లాల్చీని, పై కండువానూ వంకికి తగిలిస్తూ భార్య అన్నపూర్ణమ్మ "వెళ్ళిన పని ఇవ్వాళ్ళ కూడా కాలేదా?" అంది—మెల్లిగా, జాలిగా, వోదార్పుగా.

సమాధానం చెప్పే వోపికలేక పాత మడతకుర్చీలోకి వుస్సురంటూ కూలబడ్డాడు.

రఘురామయ్యగారు ఒకప్పుడు గాంధీగారి పిలుపందుకొని దేశ దాస్యవిముక్తి కోసం స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న దేశభక్తుడు! ఆనాటి బ్రిటిషు ప్రభుత్వం మీద "దేశభక్తి" అనే కత్తి దూసిన స్వాతంత్ర్య సమరయోధుడు! దేశంకోసం ఆస్తిపాస్తులు పోగొట్టుకొని జైలు శిక్షలతో సహా ఎన్నో కడగండ్లు అనుభవించిన నిస్వార్థ దేశసేవకుడు. రఘురామయ్య ఈ దేశం కోసం అన్నీ పోగొట్టుకున్న నికార్సయిన ఆనాటి దేశభక్తుడు; ఈనాడు తనెటు పోతోందో తనకే తెలియని ఈ దేశంలో కటిక దారిద్ర్యమనుభవిస్తోన్న ఈనాటి సామాన్య సగటు పౌరుడు! అన్ని పదవులనూ తామే కైవసం చేసుకున్న పాలకులు ఎంగిలి చేతులు విదిల్చినట్లుగా, స్వాతంత్ర్యోద్యమంలో జైలు శిక్షలు, అనుభవించిన ఫ్రీడం ఫైటర్స్‌కు నెలవారి పెన్షన్ గ్రాంట్ చేసే ఒక పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ప్రకారం పెన్షన్ పొందాలంటే ఫలానా వ్యక్తి ఫలానా జైల్లో ఫలానా సంవత్సరంలో ఫలానా ఫలానా నెలల్లో రాజకీయ ఖైదీగా




జైలుశిక్ష అనుభవించాడు-అని తెలియచెప్ప బడే జైలు సర్టిఫికెట్ దాఖలుపర్చుకోవాలి. దాన్తోపాటు ఆనాటి బ్రిటిష ప్రభుత్వంవారి కోర్టు ఉత్తర్వు నకలు కూడా జతపర్చాలి. అప్పుడు మిగతా వివరాలు కూడా కూలంకషంగాపరిశీలించిఘన తవహించినప్రభుత్వం వారు నెలకు రెండొందలో, మూడొందలో పెన్షన్ గ్రాంటుచేస్తారు.

రఘురామయ్యఇంకా ఈజైలు సర్టిఫికెట్ సంపాదించే ప్రయత్నంలోనే వున్నాడు. దానికోసమే గత నెల్లాళ్ళుగా రోజూ స్థానిక సెంట్రల్ జైలు చుట్టూ తిరుగుతున్నాడు. తానానాడు కారాగారవాసం చేసిన జైలువున్న ఆ వూళ్ళోనే వుండడం ఇంకా మేలు అయింది. అదే ఏ బళ్ళారి జైలో, ఏ రాయవేలూరి జైలో అయితే రైలుచార్జీలు పోయలేక చచ్చివుండేవాడు. ఆయన ఇప్పుడున్న స్థితిలో రోజూ సిటీబస్సు చార్జీలు పోయలేక కావల్సిన సర్టిఫికెట్ సంపాదించలేక, కోడలు తల్లి సాధింపులు పడలేక సతమతమయిపోతున్నాడు. పాపం, ఆయన ముసలి ప్రాణం కదబట్టిపోతూంది.

అన్నపూర్ణమ్మ వంటింట్లోంచి వచ్చి, "సరే, ఇక భోజనానికి లేవండి!" అని పిలిచింది.

లోపల వంటింట్లో ఆయన భోజనం చేస్తోంటే, బయట నడవాలో కూర్చొని కోడలు ఒకప్రక్క బియ్యం ఏరుతున్నట్టు ఏరుతూ మరోప్రక్క మామగార్ని వూరికే దూదేకినట్లు ఏకిపారేస్తోంది.

"....సీతామహాలక్ష్మి వాళ్ళ మామగారు పరంధామయ్యగారు — ఈయనలాగే జైలు కెళ్ళారంట. ఆయనగారు అదేం విచిత్రమో చిటుక్కున ఆ పెన్షన్ కాస్తా శాంక్షన్ చేయించుకున్నాడంట! అప్పట్లిగా నెలనెలా రెండొందల రూపాయలు బిల్లకుడుముల్లాగా చేతులో పడుతున్నాయంట. మొన్న సీతామహాలక్ష్మి కనిపించి చెప్పింది. మరి మా ఖర్మ ఎందుకిలా కాలిందో! ఆ, నా పిచ్చిగానీ, కావాలని గట్టిగా ప్రయత్నిస్తే రాకపోతుందా? ఆ డబ్బులువస్తే నేనూ నా పిల్లలూ ఎక్కడ తినిపోతామోనని ఏడుపో ఏంటో."

రఘురామయ్యకు తింటున్న కారం మెతుకుల్లో కారం కంటె, కోడలు మాటల్లోని "కారం" గుండెల్లో మంటల్ని రేపుతూంది.

తల ఎత్తి భార్యవంక బాధగా చూశాడు. ఆమె నిస్సహాయంగా తలదించుకుంది.

ఆయనకిక అన్నం సహించలేదు. మధ్యలో లేచిపోయాడు. అన్నపూర్ణమ్మ నిశ్శబ్దంగా కళ్ళొత్తుకుంది.

దొడ్లో చేతులు కడుక్కుంటున్నా ఇంకా కోడలు మాటలు వినిపిస్తూనే వున్నాయి.... ఆయన గుండెల్లో చిల్లులు పొడుస్తోన్నాయి.

".... ముప్పూటలా మెక్కి కూచునే వాళ్ళకు ఎదుటి వాళ్ళ బాధేం తెలుస్తుంది? మోసేవాళ్ళకు తెలుస్తుంది బరువూ, బాధాన్నూ! తెచ్చిపడేయలేక, ఈ మాయదారి మందను మేపలేకా ఆయన అలా సతమతమయిపోతున్నారు, నా మొగానికి కట్టుకోటానికి సరైన చీరలేక నేనిలా అఘోరిస్తున్నాను...."

ఆయన లోపలికి వచ్చి గబగబా బట్టలేసుకుంటూంటే అన్నపూర్ణమ్మవచ్చి, "ఇప్పుడు మళ్ళీ ఎక్కడికండీ? ఇప్పుడేకదా ఎండలో బడి వచ్చారు!" అంది.

"అలా బయటకెళ్ళివస్తాను" అంటూ వీధిలోకి నడిచాడు.

నేరుగా ఆ పరంధామయ్య యింటికే వెళ్ళాడు—తను నెల్లాళ్ళుగా సంపాదించలేని సర్టిఫికెట్ ఆయన ఎలా చిటుక్కున సంపాదించాడో తెల్సుకోటానికి.

పరామర్శలు అయ్యాక అసలు విషయం అడిగేడు.

అందుకా పరంధామయ్య పకపకా నవ్వి, "ఏముందయ్యా! ముందు జైలు. అక్కడ వాళ్ళకు తలా కాస్త "లంచంగడ్డి" పడేశా. అప్పుడు వాళ్ళు "పాలు" చేశారు. తర్వాత సెక్రటేరియట్. మళ్ళీ "తోడుపాలు" పోశాను. అంతే మన పని "గడ్డ పెరుగు" అయింది!" అన్నాడు.

ఆయన్ది కాస్త హాస్యం పాలు.

రఘురామయ్య "లంచం" పేరు వినగానే వులిక్కిపడ్డాడు. ఆశ్చర్యంగా "మనం ఫ్రీడం ఫైటర్సం కదా, మనం కూడా లంచం పెట్టాలా?" అన్నాడు.

"ఏ "డం" ఫైటర్సు అయినా ఈ "లంచం"తో ఫైట్ చెయ్యలేరయ్యా! వంచవల్సిందే—దీని ముందు ఎవరైనా తల వంచవల్సిందే!

"ఇంత చిన్న పన్లకూ్కడా లంచాలా?" అమాయకంగా అడిగేడు.

"అయ్యా, రఘురామయ్యా! నీవు ఏ అడివిలో వుంటున్నావయ్యా! చిన్న పనులకు చిన్న లంచం; పెద్ద పనులకు పెద్ద లంచం. రొట్టెనుబట్టే పిండి! అసలు ఈ దేశంలో లంచం లేకుండా ఏ పనవుతుంది చెప్పు! లంచం వుంటే ఏ పనికాదు చెప్పు! నీకు వైకుంఠరావు తెల్సా?" అన్నాడు.

"తెలియకేం, ఆ రోజుల్లో శ్రీకృష్ణ తులాభారం నాటకంలో రెండో కృష్ణుడు వేసేవాడు కదూ!"

## దారులు

కన్నీరు కూడా
కుహనా భక్తుడిలాగే



విషాదంలో ఒక దారి
ఆనందంలో మరోదారి.

—కాశీనాథ & కాశీనాథ

"సరీగ్గా చెప్పావు! ఆ రెండో నెంబరు కృష్ణుడే ఇప్పుడు ఒకటో నెంబరు ఫ్రీడం ఫైటరయిపోయాడు. కఠిన కారాగారవాస శిక్ష అనుభవించాడు. అలా అని ఒక ఎం. పి. గారు సర్టిఫై చేశాడు. అంతే, అతనికి ఫ్రీడం ఫైటర్స్ పెన్షన్ గ్రాంటయిపోయింది!" అన్నాడు పరంధామయ్య.

"వాడు ఫ్రీడం ఫైటరేంటయ్యా వాడి మొగం? ఆ రోజుల్లో పూట్లుగా తాగి పద్యాలు పాడేవాడు. ఏనాడన్నా నోరుతెరచి "వందేమాతరం!" అన్నపాపానపోయాడా? వాడికి పెన్షనా? నిజంగా జైలు కెళ్ళినవాడ్ని నన్నిలా రోజూ త్రిప్పిస్తారా?" ఆవేశంగా అన్నాడు.

"దటీజ్ ఇండియా! ఇప్పకటియినా అర్థం అయిందా? రోజూ నిన్నెందుకు త్రిప్పిస్తున్నారో? అక్కడున్న ఆ బొండుగాడు అప్పటికి నేను పుట్టేలేదు; మా నాన్నకు పెళ్ళే కాలేదు అంటున్నాడా? ఆ పాత రికార్డు కనిపించడం లేదంటున్నాడా?"

అవునని తల వూపాడు.

"అదిగో వాడే దొంగ వెధవ! మన రికార్డులన్నీ వాడి డ్రాయరు సొరుగులోనే వున్నాయి. వాడిమొగాన ఒక "పంద" కాగితం పారేస్తే నీ సర్టిఫికెట్ పువ్వుల్లోపెట్టిఇస్తాడు. వాడిదగ్గర ఒక కుంటి ప్యూను వున్నాడు చూడు! వాడ్ని పట్టుకొని వాడికి కొంత ముట్టచెప్పుతే వాడే అంతా "సరి" చేస్తాడు!" అన్నాడు తాపీగా.

తనకిలాటి విషయాలలో అనుభవంలేదనీ పరంధామయ్యను సాయం రమ్మనీ కోరాడు. అందులకాయన సమ్మతించాడు.

రఘురామయ్య మళ్ళి యింటి దారి పట్టాడు.

ఈ లంచాలు పోయటానికి కావల్సిన డబ్బు ఎలా సమకూర్చాలా అని దారి పొడుగూనా ఆలోచిస్తోన్నాడు. కొడుకును అడిగితే—పాపం వాడు తన బడిపంతులు ఉద్యోగంలో ఈ సంసారాన్ని లాగలేక సతమతమయిపోతూంటే తనే మొగం పెట్టుకొని ఈ లంచాలకు డబ్బు యివ్వమని అడుగుతాడు?...!

ఇంటికి వెళ్ళగానే భార్యను గదిలోకి పిలిచి, "అన్నపూర్ణా! నీ పుస్తెలు ఇలా ఇవ్వు!" అన్నాడు.

మెళ్ళో పుస్తెలను చేత్తో గట్టిగా పట్టుకుంటూ, "నా పుస్తెలా, ఎందుకు?" కంగారుగా అడిగింది.

"వాట్ని అమ్మేసి ఆ డబ్బుతేవో వాళ్ళ మొగాన కొడతా! ప్రతి చోటా లంచం పెట్టందే ఈ పెన్షన్ చేతికి రాదంట— ఆ పరంధామయ్య చెప్పాడు" అన్నాడు.

## వ్య వ స్థ

**ప్రస్తుత వ్యవస్థలో**
**బ్యారేజీలు మాత్రమే కట్టేస్తే సరిపోదు**



**డ్రైనేజీలు కూడా తప్పనిసరి!**
**అవి లేకనే దేశం కుళ్ళు కంపు**
**కొడుతోంది!**

**—భూపతిరాజు**
**వెంకట సత్యనారాయణరాజు**

నడవాలో కూర్చొని కామాక్షీ ప్రక్కింటామెతో బాతాఖానీ కొడుతోంది.

భర్తచేత మెళ్ళో పసుపుకొమ్ము కట్టించుకుంటున్న అన్నపూర్ణమ్మకు ఒకప్రక్క— ముంచుకొస్తోన్న సిగ్గు— మరోప్రక్క— పొంగివస్తోన్న ఏడుపు—ఇంకో ప్రక్క— పొర్లివస్తోన్న నవ్వున్నూ!

నిండుగా కన్నీరు నిండిన కళ్ళకు ఆ బంగారు పుస్తెలు అద్దుకుంది. తన కన్నీటితొ తడచిన వాట్ని భర్త చేతికి అందించింది.

రఘురామయ్యకు వాట్ని చూస్తోంటే ప్రాణంలేని ఆ పుస్తెలు కూడా కన్నీరు పెట్టుకుంటున్నాయా అనిపించింది.

ఇంతలో నడవాలోంచి కోడలు మాటలు వినిపిస్తున్నాయి.

"....మా మావగారు తనుగా సంపాదించింది ఏమీ లేదు. అందరిపీ అమ్మకోడమే. దేశం—సొరాజ్యం —గాంధీగారు— వందేమాతరం అంటూ ఇల్లూ వాకిలీ పట్టక దేశాలు పట్టుకుని తిరిగి, వాళ్ళ నాన్నగారు— అంటే మావారి తాతగారు—సంపాదించిన బంగారంలాంటి పన్నెండెకరాల మామిడి తోటా అమ్మేశారు. తర్వాత కూతుళ్ళ పెళ్ళిళ్ళకూ, పేరంటాలకూ, పురుళ్ళకూ పున్నేలకూ మిగిలిన వరిపొలమూ, పెద్ద బజార్లో వున్న మేడా అమ్మేశారు. ఒక్కగా నొక్క కొడుకైన మావారి చేతికి చివరికి చిప్ప యిచ్చారు...."

ఆ మాటల్ని విని బరువుగా నిట్టూర్చాడు. మళ్ళి గబగబా బయటికెళ్ళిపోయాడు.


....బంగారపు కొట్ల బజారులో నడుస్తోన్న రఘురామయ్య లాల్చిప్రక్క-జేబులో బంగారు పుస్తెలు బరువుగా కదుల్తున్నాయ్; ఆయన మనస్సులో రకరకాల ఆలోచన్లు మెదుల్తున్నాయ్.


ఈ పుస్తెలను తన పెళ్ళిలో తమ యింటి కంసాలి అయిన వేంకటాచారి యింటి దగ్గర్నుంచి మేళతాళాలతో ఘనంగా వూరేగింపుగాముత్తయిదువలుచేత వెంటబెట్టించుకొని ఈ బజారుగుండానే తీసికొచ్చారు.

ఇప్పుడు తానా పుస్తెలను అమ్మటానికి వాట్ని చాటుగా జేబులోపెట్టుకొని ఆ బజారు గుండానే పోతున్నాడు, చాతగాని దేశభక్తి వెధవలాగా.

* * *

మర్నాడు ఉదయం పది గంటలు






ప్రాంతాన నిగ్గుదీసిన ఎండ దిగంతాల మీదకు ఒంటికాలిమీద లేస్తున్న సమయంలో

—సెంట్రల్ జైలు ఆవరణలో క్రొత్తకు తొడిగి గుత్తంగావున్న వేపచెట్టు మౌనంగా చల్లటి నీడల్ని క్రిందకు దింపుతోన్న వేళలో-

పరంధామయ్య తోడురాగా రఘురామయ్య ఆ జైలు ఆఫీసు రూంలోకి అడుగు బెట్టాడు.

ఆయన్ని వరండాలో వుండమని చెప్పి పరంధామయ్య లోపలికి వెళ్ళాడు బేరసారాలు మాట్లాడి రావటానికి.

అప్పుడే అక్కడున్నవాళ్ళు "వాసన" పట్టేశారు. రఘురామయ్యను రోజూ లాగా కాకుండా సాదరంగా చూడసాగారు. ఆయనకి దాహంగా వుందంటే వాళ్ళ కూజాలోంచి, వాళ్ళ మంచినీళ్ళ, వాళ్ళ గ్లాసుతో, వాళ్ళు చేత్తో అందించారు.

వాళ్ళు అందించిన మంచినీళ్ళు త్రాగి వాళ్ళు చూపించిన కుర్చీలో కూర్చుంటూ జేబులో రొఖ్ఖాన్ని చేత్తో తడుముకున్నాడు.

అది చూసి అక్కడున్న వాళ్ళ దవడలు ఆడించారు.

రఘురామయ్య రిలాక్సింగ్ మూడ్‌లో కూర్చొని మధ్యలో ఎందుకో తలెత్తి చూశాడు. ఎదురుగుండా కనిపించిన దృశ్యాన్ని చూసి వులిక్కిపడ్డాడు.

రికార్డు రూం గోడమీద చుట్టూ పట్టిన బూజుతో, పైన అరంగుళం మేర పట్టిన దుమ్ముతో వున్న పూజ్య బాపూజీ ఫొటో కలిపించింది.

మన జాతిపితను ఆ స్థితిలో చూస్తోంటే ఆయన్లో ఏదో సంచలనం కలగసాగింది!

వందే మాతరం.... వందే మాతరం.... వందే మాతరం....

వంద గొంతుకలు వెయ్యి గొంతుకలై—వెయ్యి గొంతుకలు లక్ష గొంతుకలై లక్ష గొంతుకలు కోటిగొంతుకలై "వందే మాతరం — వందేమాతరం!" అంటూ ఆయన అంతరాంతరాలల్లో వినిపించ సాగాయి.

జాతీయ కాంగ్రెస్ జెండా రెపరెపలూ— గంభీరోపన్యాసాలూ — వూరేగింపులూ — నినాదాలూ — బ్రిటిషు ప్రభుత్వ దమన కాండా — ఆనాటి పోలీసుల బూట్ల టక టకలు — లాఠీకర్రల శబ్దాలూ — ఈలలూ— వేన్ మోతలూ—జైలు కటకటాల కిర్రు కిర్రులూ!

ఆయన గుండెలు పొంగాయి.

వీరావేశం పెల్లుబికింది.

అప్పుడాయన రఘురామయ్యగారుకాదు.

రఘురాం.

నూనూగు మీసాల రఘురాం.

కాలేజీలో ఇంటర్ చదువుతూన్న రఘురాం.

అన్యాయాలను అక్రమాలనూ సహించ లేని యువక రఘురాం! "వందేమాతరం" అనగానే వడలు పులకరించే రఘురాం!

## అణ్వస్త్రాల విస్తరం

దోపిడీదారులు
రోనాల్డు రీగన్లు!
ప్రపంచ మార్కెట్టుకి
దింపుతారు వేగన్లు!
అమ్మబోతున్నారు
న్యూట్రాన్లు!
విస్తరిలో అణ్వస్త్రాలు
వడ్డించే అమెరికన్లు!

—'చంద్రశేఖర్'

బ్రిటిషు ప్రభుత్వం పేరు చెప్పగానే రక్తం కుతకుతలాడే రఘురాం!

ఒకరోజు ఆ రఘురాం సైకిలుమీద రోడ్డువెంట పోతూన్నాడు....

జిల్లా కలెక్టరు జాన్సన్‌దొర పి. ఎ. నికొలాస్ యిల్లు అది.

జమేదారు మెడపట్టుకొని గెంటివేయగా చిన్నారావు,రంగనాయకులు ఆ యింట్లోంచి లబోదిబోమంటూ బయటికి వస్తోన్నారు.

అది చూసి రోడ్డుమీద రఘురాం సైకిలు ఆగింది. అతడు అడగ్గా రంగనాయకులు తన గోడు చెప్పుకుంటున్నాడు.

రంగనాయకులు చెప్పింది వినగానే రఘురాంలో వీరావేశం వుప్పెనలాగా పొంగింది.

అంతే, చేతిలోని సైకిల్ని రోడ్డుప్రక్కన వదేసి ఆ నికొలాస్ దొరగాడి బంగళాలోకి జొరబడ్డాడు.

అడ్డొచ్చిన జమేదార్ను ఒక్కతోపు తోశాడు. ఎదురొచ్చిన నికొలాస్ వుంపుడు కత్తె రీటా మీద "థూ!" అని వుమ్మేశాడు!

నేరుగా భోజనాలబల్ల దగ్గరికి వచ్చాడు. నేతిలో వేయించిన కోడిపిల్లను ముందు పెట్టుకొని, మద్యం సీసాను ప్రక్క పెట్టుకొని విందారగించబోతున్న నికొలాస్ దొర పై దొరకపుచ్చుకొని ముందుకు గుంజాడు...

"ఏరా నికొలాస్ దొరా! నికృష్టపు వెధవా? మా దేశానికి వచ్చి మా దేశపు రైతును "లంచం" ఇవ్వమని పీడిస్తావురా? ఈ గడ్డకు జమీందారయిన నీలాద్రి అప్పారావుగారు తమ దగ్గర నిఘామానుగా పన్జేసిన వీళ్ళ తండ్రికి భూమి దానంయిస్తే— దానికి పట్టా మంజూరు చెయ్యటానికి నీకు రెండు కోడిపెట్టలూ, మానెడు వెన్నపూసా, సంచెడు వెండిరూపాయి బిళ్లలూ "లంచం" కావాల్రా? మా జమీందారు మా రైతుకు వుదారంగా భూమి దానంగా యిస్తే, ఏదో దేశాన్నుంచి పొట్టకూటికి వచ్చిన అంట్లవెధవ్వు మధ్యలో నీకు "లంచం" ఎందుకురా దగుల్బాజీ వెధవా?" అంటూ ఆ నికొలాస్ దొరను పిచ్చికుక్కను కొట్టినట్లు కొట్టసాగాడు.

ఫలితం?

తన పేరు వూరూ వాడా మారుమ్రోగిపోయింది. ప్రశంసల పూజల్లులు. తనలో పెల్లుబికిన గర్వం. తల్లి కంట పొంగిన కన్నీరు. తనమీద అరెస్టువారంటు.

ఆ వూర్నుంచి అరెస్టు అయిన మొదటి కాంగ్రెసు కార్యకర్త తను! అప్పటికే పట్టణ యువజన కాంగ్రెసు కార్యకర్తలు నినాదాలు యిస్తూ తమ యింటికి వచ్చారు. పూలదండ వేశారు. వీర తిలకం దిద్దారు.

ఇంతలో పోలీసు సార్జెంటులు ఈలలు వూదుతూ వచ్చారు. తనను చుట్టుముట్టారు. ఇదే జైలుకు తనని ఖైదీగా తీసికొచ్చారు. మిన్నుముట్టే నినాదాల మధ్య, జైజై ధ్వానాల మధ్య తను ఒక వీరుడులాగా, ఒక యోధుడు లాగా రొమ్ము విరుచుకుంటూ ఈ జైలుముందు పోలీస్ వేన్‌లోంచి క్రిందకు దిగాడు.

"వందేమాతరం!"

"బ్రిటిషు తొత్తు లంచగొండి నికొలాస్ నశించాలి!"

"బోలో స్వతంత్ర భారత్‌కీ జై!" అంటూ, ఒక ప్రక్క లాఠీకర్రలు తన నడ్డిమీద పడుతూవున్నా లక్ష్యపెట్టకుండా అరుస్తూ ఈ జైలులోపలికి నడిచాడు.

అది ఆనాటి వీరావేశం, దేశభక్తిన్నూ!

అలా ప్రారంభమయింది. స్వాతంత్ర్యోద్యమ వీరునిగా తనను నిలబెట్టిన తొలి ఘట్టం!

ఏ లంచగొండితనాన్ని ప్రతిఘటిస్తూ తనానాడు ఏ జైలు పాలయ్యాడో, ఈనాడు అదే జైలు అధికారులకు ఈ సర్టిఫికెట్ కోసం లంచం ఇవ్వవల్సివస్తోంది!

ఇంతకంటె సిగ్గుచేటు పని ఇంకేవన్నా వుంటుందా? ఇంతకంటె ఆత్మవంచన పని మరింకేమన్నా వుంటుందా!

ఛీఛీ తనిలాటి తప్పుడుపని చేయలేడు. వెధవ పెన్షన్ రాకపోతే పింగాయిరి. తను మాత్రం ఆత్మవంచన చేసుకోలేడు. కోడలు సాధిస్తుందా! సాధించనీయ్! ఆ సాధింపులు పడలేకపోతే తనూ, తన భార్య అన్నపూర్ణా కలిసి ఏ వూరికో పోతారు. కూలినాలి చేసుకుంటారు. అందుకూ వోపిక లేకపోతే నాల్గు యిళ్ళు అడుక్కొని తింటారు. అంతేగాని తనీ తప్పుడుపని చేయలేడు.

ఏ ఆశయాలను, ఆదర్శాలనూ కవచాలుగా పెట్టుకొని దేశంకోసం ఆనాటి ఏలికలకు ఎదురొడ్డి నిల్చాడో, ఆ ఆశయాలనూ, ఆదర్శాలనూ ఈనాటి పాలకులు ఇవ్వజూపే ఈ ముష్టి పెన్షన్ డబ్బులకోసం అమ్ముకోలేడు!


ఇలా లంచం యిచ్చి పొందే ఈ దేశ సత్కారమూ, మన్నింపూ తనకొద్దు. ఈ తప్పుడు పెన్షన్ కూడుతినేకంటె పస్తులు పడి చావడం మేలు అనుకున్నాడు.

పరంధామయ్యను బయటికి పిలిచి ఇదే మాట చెప్పాడు.

ఆయన నోరెళ్లబెట్టుకొని విచిత్రంగా చూస్తోంటే, రఘురామయ్య మెల్లగా బయటికి వచ్చేశాడు.

"ఈయన ఈ కాలం మనిషికాడు?" అనుకుంటూ పరంధామయ్యకూడా బయటికి వచ్చేశాడు.


# జలుబు వల్ల ఓ మంచి రోజును పాడవనివ్వకండి



## జలుబును పోగొట్టుకోవచ్చు


ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, తలభారం, గొంతు నొప్పి, గుండెలో కఫం చేరడం లాంటివన్నీ మీ మంచి రోజుల్ని పాడు చేస్తాయి. అయితే, ఈ లక్షణాలుగల జలుబునుంచి ఉపశమనానికి ఓ మార్గం ఉంది.

## జలుబు మందుతో వాటిని ఎదుర్కోండి

ఏ ఇతర జబ్బుకో చికిత్స చేసినట్టు జలుబుకి చికిత్సచేస్తే చాలదు. జలుబు లక్షణాలకు లోనైన అన్ని చోట్లా ఒకే మారుగా పనిచేసే ప్రత్యేకమైన మందే వాడండి.

## కోల్డరిన్ కేవలం జలుబు కోసమే

మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అన్ని జలుబు లక్షణాలనుంచి ఉపశమనం కలిగిస్తుంది కోల్డరిన్. దీనిలోని ప్రత్యేకమైన ఔషధ పదార్థాలు జలుబు లక్షణాలుగల అన్నిచోట్లా కలిసికట్టుగా పనిచేస్తాయి. పైగా మీ శరీరంలో నిరోధక శక్తిని పెంచే విటమిన్ సి దీనిలో ఉంది. మీకు జలుబు చేస్తే, దానికి ప్రత్యేకమైన జలుబు మందే వేసుకోవడం ఉత్తమం.



# కోల్డరిన్

జలుబు కోసం ప్రత్యేకంగా తయారుచేయబడింది

CASBC-64-232 TL